క్లుప్తంగా

సరిపడా యూరియా సరఫరా చేయాలి..



మాట్లాడుతున్న అన్నవరపు కనకయ్య

ములకలపల్లి: రైతులకు యూరియా కొరతలేకుండా చూడాలని, ఎలాంటి షరతులు లేకుండా యూరియా బస్తాలు ఇవ్వాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు అన్నవరపు కనకయ్య డిమాండ్ చేశారు. పాడియం వెంకటేశ్వర్లు అధ్యక్షతన శనివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. యూరియా కోసం అన్నదాతలు సొసైటీల వద్ద పడిగాపులు కాస్తున్నారన్నారు. ఇందిరమ్మ ఇంటి బిల్లులు వెంటనే చెల్లించాలని, త్వరిగతిన నిర్మాణాలు పూర్తయ్యేలా చూడాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి రాంబాబు, మాలోతు రావూజా, గౌరి నాగేశ్వరరావు, నిమ్మల మధు, కుంజా రామ్మూర్తి, సోయం కృష్ణ పాల్గొన్నారు.

ఆధార్‌కార్డు ఆధారంగా ఇవ్వాలి

కరకగూడెం: మండలంలో వివిధ పంటలు సాగు చేస్తున్న రైతులకు తగిన స్థాయిలో యూరియా సరఫరా చేయాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు నిమ్మల వెంకన్న డిమాండ్ చేశారు. శనివారం అశ్వాపురంపాడ్ గ్రామంలో జరిగిన సీపీఎం మండల కమిటీ సమావేశంలో పాల్గొని ఆయన మాట్లాడారు. వ్యవసాయ సీజన్ ప్రారంభంలోనే యూరియా సరఫరాపై దృష్టి పెట్టి ఉంటే రైతులు ఈ పరిస్థితి ఎదుర్కొనేవారు కాదని, ప్రభుత్వం రైతుల పక్షాన నిలవడంలో విఫలమైందని విమర్శించారు. సమావేశంలో కొమరం కాంతారావు, చర్ప సత్యం, బిలపాటి శంకరయ్య, కణితి రాము, పద్దం బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

వేధింపులు ఆపాలి



మాట్లాడుతున్న ప్రభాకర్

అశ్వారావుపేట: పోడు సాగుదారులపై అటవీశాఖ సిబ్బంది వేధింపులు ఆపాలని సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు గోకినపల్లి ప్రభాకర్ అన్నారు. దుబ్బగూడెం పంచాయతీ దురదపాడు గ్రామ శివారులోని పోడు భూములను శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఆదివాసీలు ఎన్నోఏళ్లుగా పోడు సాగు చేస్తున్నారని తెలిపారు. ఆయా భూముల్లో అటవీశాఖ ఆధ్వర్యంలో కందకాలు తీసి, సేద్యాన్ని అడ్డుకునే కుటిల యత్నాలు చేస్తున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో అఖిల భారత ఐక్య సంఘం మండల అధ్యక్షుడు తండా ముత్యాలు, ప్రగతిశీల యువజన సంఘం మండల కార్యదర్శి కుంజా అర్జున్, స్థానిక నాయకులు కోరం కన్నయ్య, పాయం పోతురాజు తదితరులు పాల్గొన్నారు.

డివిజన్ కమిటీ ఎన్నిక

భద్రాచలంటౌన్: డివిజనల్ పంచాయతీ రాజ్ నాలుగో తరగతి ఉద్యోగుల నూతన కమిటీని జిల్లా అధ్యక్షుడు పులికంటి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో శనివారం ఎన్నుకున్నారు. బూర్గంపాడు, భద్రాచలం, దుమ్ముగూడెం, చర్ల, మండలాల పంచాయతీ రాజ్ శాఖ ఉద్యోగులు పాల్గొనగా.. అధ్యక్షుడిగా పెరుమాళ్ల అజయ్‌కుమార్, కార్యదర్శిగా సందీప్, అసోసియేట్ అధ్యక్షురాలిగా మడివి రత్తమ్మ, ఉపాధ్యక్షుడిగా లక్ష్మయ్య, సహాయ కార్యదర్శిగా మోహన్‌రావు, కోశాధికారిగా సుభాకర్, కోఆప్షన్ సభ్యుడిగా యూసుఫ్, మహిళా అధ్యక్షురాలిగా అనిత, కార్యదర్శిగా స్వాతితో పాటు కార్యవర్గ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

వాహనాల తనిఖీ

భద్రాచలంఅర్బన్: సరైన పత్రాలు లేకుండా వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవని ట్రాఫిక్ ఎస్‌ఐ తిరుపతి అన్నారు. భద్రాచలం పట్టణంలోని ప్రధాన రోడ్ల వెంట శనివారం ఉదయం వాహన తనిఖీలు నిర్వహించారు. ప్రతి ఒక్క వాహనాన్ని చెక్ చేస్తున్నామని, ద్విచక్ర వాహనం నడిపేటప్పుడు లైసెన్స్ కలిగి ఉండాలని, నిబంధనలను పాటించాలని ట్రాఫిక్ ఎస్‌ఐ తిరుపతి తెలిపారు. మద్యం తాగి డ్రైవింగ్ చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

నిబంధనలు పాటించాలి

అశ్వాపురం: గణేశ్ ఉత్సవ కమిటీ బాధ్యులు నిబంధనలు, జాగ్రత్తలు పాటించాలని సీఐ అశోక్‌రెడ్డి సూచించారు. అశ్వాపురం పోలీస్ స్టేషన్‌లో శనివారం మండలంలోని గణేశ్ ఉత్సవ కమిటీ బాధ్యులతో సీఐ సమావేశం నిర్వహించారు. గణేశ్ మండపాలకు అన్ని శాఖల అనుమతులు పొందాలని, మండపాల వద్ద ఎల్లప్పుడూ కమిటీ సభ్యులు అందుబాటులో ఉంటూ విద్యుత్ ప్రమాదాలు జరగకుండా తగు జాగ్రత్తలు పాటించాలని పేర్కొన్నారు. నిమజ్జనం సమయంలో డీజేలకు అనుమతి లేదని, గొడవలు, ఉద్రిక్తతలకు దారి తీస్తే కమిటీ వారే బాధ్యత వహించాలని స్పష్టం చేశారు.

కనులపండువగా కృష్ణాష్టమి



దమ్మపేట: ఆశ్రమ పాఠశాలలో ఉట్టిగొడుతున్న హెచ్‌ఎం



మణుగూరుటౌన్: విజేతలకు బహుమతులు అందజేస్తున్న నిర్వాహకులు

మణుగూరుటౌన్: మండలంతో పాటు పట్టణంలోని పలు ఏరియాల్లో శ్రీకృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఉట్టికొట్టే కార్యక్రమాలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. పలుచోట్ల నృత్యప్రదర్శన ఏర్పాటు చేయగా, ప్రతిభ చూపిన చిన్నారులకు తహసీల్దార్ నరేశ్, కాంగ్రెస్ నాయకులు గంటా రమేశ్ బహుమతులు అందజేశారు.

అశ్వారావుపేటలో..

అశ్వారావుపేటరూరల్: మండలవ్యాప్తంగా శ్రీకృష్ణాష్టమి వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఆసుపాక వేణుగోపాల స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు.

కరకగూడెంలో..

కరకగూడెం: శ్రీ కృష్ణ జన్మాష్టమి వేడుకలు శనివారం మండలంలో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా బాలబాలికలు చిన్ని కృష్ణుడు, గోపిక వేషధారణలతో ఆకట్టుకున్నారు.

దమ్మపేటలో..

దమ్మపేట: మండలంలోని గ్రామగ్రామాన కృష్ణాష్టమి వేడుకలను శనివారం ఘనంగా జరుపుకున్నారు. శ్రీ కృష్ణుడిని పూలతో అలంకరించి, ప్రత్యేక పూజలు చేశారు. చిన్నపిల్లలు శ్రీ కృష్ణుడు, గోపిక వేషధారణలో అలరించారు. దుర్గం గొల్లగూడెం బాలికల ఆశ్రమ పాఠశాలల్లో ఉట్టి ఏర్పాటు చేయగా, విద్యార్థులు, హెచ్‌ఎం చంద్రకళ, ఉపాధ్యాయులు ఉట్టి కొట్టడానికి ప్రయత్నించారు.

అన్నపురెడ్డిపల్లిలో..

అన్నపురెడ్డిపల్లి (చంద్రుగొండ): మండలంలోని జానకీపురంలో శ్రీకృష్ణాష్టమి వేడుకలు శనివారం నిర్వహించారు. కోదండ రామాలయంలో మంగళ తోరణం, గోపూజ, గోత్రనామపూజ నిర్వహించారు. చంద్రుగొండ మండలంలోని రేపల్లెవాడలో శ్రీకృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు.



అశ్వారావుపేటరూరల్: వేణుగోపాలస్వామి ఆలయంలో పూజల్లో పాల్గొన్న దంపతులు



అశ్వారావుపేటరూరల్: కృష్ణుడి వేషధారణలో..



కరకగూడెం: వేషధారణలో చిన్నారులు



ములకలపల్లి: సరస్వతి శిశుమందిర్‌లో..



చంద్రుగొండ: స్వామిని ఊరేగిస్తున్న భక్తులు



బూర్గంపాడు, గాంధీనగర్‌లో..

గ్రామంలోని రామాలయంలో మహిళలు పూజలు చేశారు. అనంతరం స్వామివారిని ఊరేగించారు.

ములకలపల్లిలో..

ములకలపల్లి: మండలవ్యాప్తంగా శ్రీకృష్ణాష్టమిని శనివారం ఘనంగా జరుపుకున్నారు. పిల్లలకు శ్రీకృష్ణుడు, గోపికల వేషాలు వేయించారు. స్థానిక సరస్వతి శిశు మందిర్, అభయాంజనేయ స్వామి ఆలయం వద్ద ఉట్టి కొట్టే వేడుకను వైభవంగా నిర్వహించారు.

బూర్గంపాడులో..

బూర్గంపాడు: శ్రీకృష్ణాష్టమి వేడుకలు మండలవ్యాప్తంగా శనివారం ఘనంగా నిర్వహించారు. గాంధీనగర్ శ్రీకృష్ణమందిరంలో భజనలు చేశారు. శోభాయాత్ర నిర్వహించారు. ఉట్టికొట్టే కార్యక్రమాలు వేడుకగా సాగాయి.

అర్హులందరికీ ఇళ్లు ఇస్తాం..

ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు



రేషన్‌కార్డు అందిస్తున్న ఎమ్మెల్యే పాయం

గుండాల: అర్హులైన నిరుపేదలందరికీ విడుతలవారీగా ఇందిరమ్మ ఇళ్లు ఇస్తామని, మెదటి విడుతలో మంజూరైన ఇళ్ల నిర్మాణం వేగవంతం చేసుకోవాలని పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అన్నారు. శనివారం ఆయన ఆళ్లపల్లి మండలంలో పర్యటించారు. పలు గ్రామాల్లో సీసీరోడ్ల ప్రారంభించారు. అనంతరం ఆళ్లపల్లి రైతువేదికలో 549 మందికి కొత్తగా వచ్చిన రేషన్‌కార్డులను పంపిణీ చేశారు. మండలంలోని 19 మందికి కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రవ్యాప్తంగా పేదలు ఆకలితో ఉండొద్దని అర్హులైన ప్రతి ఒక్కరికీ రేషన్ కార్డు అందించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నిర్ణయం తీసుకున్నారన్నారు. ఇందిరమ్మ ఇళ్లు మంజూరైన లబ్ధిదారులకు నాలుగు విడుతలుగా నేరుగా ఖాతాలో డబ్బులు జమ అవుతాయని తెలిపారు. ప్రభుత్వం ఏర్పాటు అనంతరం రూ.రెండు లక్షలు రుణమాఫీ, రైతుబీమా, రైతుబంధు, రైతు భరోసా, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, మహిళలను ఆర్థికంగా అభివృద్ధి పథంలో నడిపేందుకు వడ్డీలేని రుణాలు, రూ.500కే వంటగ్యాస్, 200 యూనిట్ల ఉచిత కరెంట్, ఇందిరమ్మ ఇళ్లు లాంటి ఎన్నో పథకాలు దేశంలో ఎక్కడా లేని విధంగా అమలవుతున్నాయని చెప్పారు. మండలంలో నిధులు మంజూరై అటవీశాఖ అనుమతి లేక నిలిచిపోయిన రోడ్లు, బ్రిడ్జీల పనులు త్వరలోనే ప్రారంభమయ్యేలా కృషి చేస్తామని ఎమ్మెల్యే పేర్కొన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాస్‌యాదవ్, ఎంపీడీఓ శ్రీనివాస్, పీఆర్‌డీఈ రామనాథం, ఎంఈఓ కాంతారావు, వైద్యాధికారి సంఘమిత్ర, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు పాయం రాంనర్సయ్య, మాజీ ఎంపీపీ పెండెకట్ల పాపారావు, ఎండీ అతహార్, శ్రీకాంత్, పడిగ సమ్మయ్య పాల్గొన్నారు.

వర్షాలతో రైతుల్లో ఆనందం



నీటితో కళకళలాడుతున్న తుమ్మలచెరువు

అశ్వాపురం: మండలంలో ప్రధాన సాగునీటి వనరైన కాకతీయుల కాలం నాటి తుమ్మలచెరువు ఆయకట్టు కింద ఖరీఫ్‌లో పంటలు పండుతాయా? లేదా? అని అయోమయంలో ఉన్న రైతులకు.. నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలుఖరీఫ్‌పై ఆశలు కలిగించాయి. తుమ్మలచెరువు నీటిమట్టం గురువారం నాటికి 15 అడుగులకు చేరుకుంది. 23 అడుగులు వస్తే చెరువు నిండి అలుగు పారుతుంది. 18 అడుగులు వస్తే ఖరీఫ్‌కు సరిపోతాయి. ఈ చెరువు ఆయకట్టు కింద 10 వేల ఎకరాల్లో రైతులు వరిసాగు చేస్తున్నారు. ఇటీవల వర్షాలు రాక చెరువులో నీరు చేరక 14 అడుగులు నీరు ఉండగానే రైతులు వరినాట్ల కోసం తూములు తీశారు. రెండు అడుగుల మేర నీరు తగ్గగా నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలకు మూడు అడుగులు నీరు చేరింది. తూములు ఆపివేశారు. మరో మూడు నాలుగు అడుగులు నీరు వస్తే ఖరీఫ్‌కు ఢోకా లేనట్టేనన రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

మహాసభల వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ



వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు

భద్రాచలంటౌన్: పట్టణంలోని అశోక్‌నగర్ కాలనీ డీవీకే భవనంలో అఖిల భారత ఐక్య రైతు సంఘం (ఏఐయూకేఎస్) రాష్ట్ర ప్రథమ మహాసభల వాల్ పోస్టర్లను డివిజన్ నాయకుడు దాసరి సాయన్న శనివారం ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ.. రైతులకు సబ్సిడీతో పురుగుమందులు, విత్తనాలు అందించాలని, పంట ఉత్పత్తులకు గిట్టుబాటు ధర నిర్ణయించి ప్రభుత్వమే కొనుగోలు చేయాలని కోరారు. అధికారులు రైతులు పడుతున్న కష్టాన్ని గుర్తించాలని, దుకాణాలు చేస్తున్న మోసాలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ నెల 25, 26 తేదీల్లో జరిగే అఖిల భారత ఐక్య రైతు సంఘం రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో డివిజన్ నాయకులు భాస్కర్, కృష్ణవేణి, షకీరా, శివ ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ ఆధ్వర్యంలో వాజ్‌పేయి వర్ధంతి



నివాళులర్పిస్తున్న నాయకులు

చర్ల: దివంగత మాజీ ప్రధానమంత్రి అటల్ బిహారీ వాజ్‌పేయి వర్ధంతిని శనివారం బీజేపీ నాయకులు నిర్వహించారు. బత్తుల వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో వాజ్‌పేయి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వాజ్‌పేయి మంచి వక్త, కవి, మేధో సంపన్నుడని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఓబీసీమోర్చా జిల్లా అధ్యక్షులు బిట్రగుంట క్రాంతికుమార్, సీనియర్ నాయకులు సాధం లోకనాథం, ముత్తారం రతయ్య, బత్తుల వెంకటేశ్వరరావు, పగడాల శ్రీధరరావు, పుగాకు పూర్ణచందు, అలెం సమ్మయ్య, చిడెం గోపి, ఓబీసీ జిల్లా కార్యదర్శి గుమ్మల వేణుకుమార్, ఓబీసీ మండల అధ్యక్షుడు కొండేటి చంద్రశేఖర్, చక్రధర్ పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ



చెక్కులు అందిస్తున్న ఎమ్మెల్యే ఆదినారాయణ

చంద్రుగొండ: మండలంలోని పలు గ్రామాల్లో పలువురికి మంజూరైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను ఎమ్మెల్యే జారె ఆదినారాయణ శనివారం అందించారు. రైతు వేదికలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. అనారోగ్యం పాలైనవారికి ప్రభుత్వం కొంత ఆర్థిక సాయం అందిస్తుందన్నారు. పోడురైతులకు కేంద్ర ప్రభుత్వం 90 శాతం రాయితీపై రుణాలు అందిస్తోందని, ఈ పథకాన్ని అర్హులైన రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ నెల 21వ తేదీన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మండలంలో పర్యటించనున్నారని వెల్లడించారు. కార్యక్రమలో నాయకులు భోజ్యానాయక్, అంకిరెడ్డి కృష్ణారెడ్డి, సారేపల్లి శేఖర్, ఎస్డీ రసూల్, ఇంజం అప్పారావు, ఎండీ ఇమ్రాన్, కేశబోయిన నర్సింహారావు, బుంగా శ్రీను, ఇస్లావత్ రుక్మిణి తదితరులు పాల్గొన్నారు.

దుమ్ముగూడెం ఎస్‌ఐగా రాజశేఖర్

దుమ్ముగూడెం: మండల ఎస్‌ఐగా కె.రాజశేఖర్ శనివారం విధుల్లో చేరారు. ఆయన ములకలపల్లి పోలీస్ స్టేషన్ నుంచి బదిలీపై దుమ్ముగూడెం వచ్చారు. గతంలో గుండాల పోలీస్‌స్టేషన్‌లో పనిచేశారు. ఆయనకు సీఐ అశోక్‌తోపాటు ఎస్‌ఐ గణేశ్, సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

వర్షాలకు కూలిన ఇల్లు

మణుగూరురూరల్: మండలంలోని గుట్టమల్లారం గ్రామ పంచాయతీ జయశంకర్‌నగర్‌కాలనీలో జగిడి గౌతమికి చెందిన రేకుల ఇల్లు శుక్రవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి కూలింది. విషయం తెలుసుకున్న మణుగూరు తహసీల్దార్ అద్దంకి నరేశ్ ఘటనా ప్రాంతానికి చేరుకుని కూలిన ఇంటిని పరిశీలించారు. తక్షణ సాయం కింద 25 కేజీల బియ్యం, నిత్యావసర సరుకులను అందజేశారు.

ఏచూరి స్ఫూర్తితో ఉద్యమం




దుమ్ముగూడెం: మాట్లాడుతున్న మచ్చా వెంకటేశ్వర్లు

చర్ల: స్వాతంత్ర్య ఫలాలు ప్రజలందరికీ అందాలని పోరాడిన గొప్ప నాయకుడు సీతారాం ఏచూరి అని, ఆయన స్ఫూర్తితో ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం ఉద్యమించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మచ్చా వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. శనివారం చర్లలోని బీఎస్ రామయ్యభవన్‌లో సీపీఎం జాతీయ నాయకులు, మాజీ ఎంపీ దివంగత సీతారాం ఏచూరి 73వ జయంతి సభ పార్టీ మండల కార్యదర్శి మచ్చా రామారావు అధ్యక్షతన నిర్వహించగా.. ఆయన పాల్గొని మాట్లాడారు. సీతారాం ఏచూరి సంపన్న కుటుంబంలో జన్మించినా జీవితాంతం పేద ప్రజల కోసం దోపిడీ లేని సమాజం కోసం కృషి చేశారన్నారు. సభలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు, మండల ఇన్‌చార్జ్ రేపాకుల శ్రీనివాస్, మచ్చ రామారావు, పొడుపుగంటి సమ్మక్క, బందెల చంటి, పామర్ బాలాజీ, నవీన్, వరదల వరలక్ష్మి, షారోని, శ్యామల కాంతయ్య, మల్లారపు నర్సింహారావు, ఇర్పా నాగమ్మ, మడప ఇందు, సోడి మోహన్‌రావు పాల్గొన్నారు.

ప్రభుత్వ నిర్లక్ష్యంతోనే..

దుమ్ముగూడెం: భద్రాచలం డివిజన్‌లోని రహదారుల దుస్థితికి ప్రభుత్వ నిర్లక్ష్యమే కారణమని సీపీఎం జిల్లా కార్యదర్శి మచ్చా వెంకటేశ్వర్లు విమర్శించారు. శనివారం ములకపాడు వైఎస్ భవన్‌లో సీపీఎం మండల కమిటీ సమావేశం యలమంచి వంశీకృష్ణ అధ్యక్షతన జరగగా ఆయన పాల్గొని మాట్లాడారు. భద్రాచలం నుంచి దుమ్ముగూడెం, చర్ల, వెంకటాపురం రహదారులు మృత్యు కూపాలుగా మారుతున్నాయని, ప్రతీరోజు ఏదో ఒకచోట ప్రమాదం జరుగుతోందన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శి కారం పుల్లయ్య, నాయకులు రేపాకుల శ్రీనివాస్, మర్మం చంద్రయ్య, కొరస చిలకమ్మ, ఎలమంచి శ్రీనుబాబు, బొల్లి సత్యనారాయణ, ఖాదర్ బాబు, గోవర్ధన్, ఎండీ బేగ్, సరియా ప్రసాద్, కారం బజార్, మహేంద్ర సింహ, సకినాల ప్రేమ్‌కుమార్ పాల్గొన్నారు.

క్రీడాకారుడిని అభినందించిన ఏఎస్పీ



శంకర్‌రావును అభినందిస్తున్న ఏఎస్పీ

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణంలోని సిటీ స్టైల్ జిమ్ క్రీడాకారుడు డీవీ శంకర్‌రావును భద్రాచలం ఏఎస్పీ విక్రాంత్‌కుమార్‌సింగ్ శనివారం అభినందించారు. కేరళలో జరిగిన జాయితీయస్థాయి పోటీల్లో నాలుగు బంగారు పతకాలను ఆయన కైవసం చేసుకున్నాడు. కష్టపడితే ఏదైనా సాధించవచ్చని 73 ఏళ్ల శంకర్‌రావు నిరూపించారని ఈ సందర్భంగా ఏఎస్పీ తెలిపారు. కార్యక్రమంలో జిమ్ కోచ్ రామిరెడ్డి, శివరామకృష్ణ పాల్గొన్నారు.

సీఎంను కలిసిన భద్రాద్రి-ఏ బ్లాక్ అధ్యక్షుడు



సీఎం రేవంత్‌రెడ్డితో సతీశ్

భద్రాచలంటౌన్: భద్రాచలం నియోజకవర్గ ఏ బ్లాక్ అధ్యక్షుడు బలుసు నాగసతీశ్ ముఖ్యమంత్రి రేవత్‌రెడ్డిని ఆయన నివాసంలో శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన భద్రాచలం సమస్యను సీఎంకు వివరించారు. ఏపీలో విలీనమైన ఐదు పంచాయతీల సమస్యతో పాటు గోదావరి కరకట్ట నిర్మాణ పనులు త్వరగతిన పూర్తి చేసే విధంగా ప్రత్యేక చొరవ చూపాలని సీఎంను కోరినట్లు సతీశ్ వెల్లడించారు.

పాములు.. రైతు నేస్తాలు

- ప్రజలకు అవగాహన కల్పిస్తున్న స్నేక్ క్యాచర్ ముజాఫర్
- 3 వేల పైగా పాములు పట్టి అడవిలోకి తరలింపు..
- సింగరేణి ఉద్యోగంతోపాటు అవగాహన కార్యక్రమాలు..



కార్మికవాడలో పట్టుకున్న సర్పంతో ముజాఫర్ (ఫైల్)

మణుగూరుటౌన్: నిద్రిస్తున్న వేళ పాము కలలో కనిపిస్తేనే ఉలిక్కిపడతాం. ఇక కళ్ల ముందు కనిపించి బుసలు కొడితే అసంకల్పితంగానే పరుగులు తీస్తాం. అయితే మణుగూరు మండలం సింగరేణిలో పనిచేసే ముజాఫర్ మాత్రం వాటికి ఎవరైనా హాని చేస్తారేమోననే ఆందోళనకు గురవుతాడు. అయ్యో పాపం అంటూ కలుగులోకి వెళ్తే బయటికి వచ్చేలా చేసి దానిని పట్టుకుని జనావాసాల నుంచి కిలోమీటర్ల మేర అడవుల్లోకి తీసుకెళ్లి వదిలేస్తాడు. అన్ని పాములూ హానికరం కావని, అవి మానవులకు ఒక విధంగా స్నేహితులేనని చెబుతున్నాడు. పాములు పట్టుకున్న ప్రతి చోట పాములను చంపొద్దని అవగాహన కల్పిస్తూ జీవ వైవిధ్యాన్ని కాపాడుతూ.. పలువురికి స్ఫూర్తిగా నిలుస్తున్నాడు. పాములు పట్టడంలో ఆయనది ప్రత్యేక శైలి. మండలంలో ఎక్కడ పాము కనిపించినా ముజాఫర్‌నే సంప్రదిస్తారంటే అర్థం చేసుకోవచ్చు.

ఆ ఘటనతోనే..

తన చిన్న వయసులో ఇంటి సమీపంలోకి వచ్చిన పాములను కొందరు కొట్టి చంపేందుకు ప్రయత్నించగా, అది తప్పించుకునేందుకు ఉరుకులు పరుగులు పెట్టి చేసిన ప్రయత్నం మనసుకు ఆవేదన కలిగించిందని, అప్పటి నుంచి పాములను చంపకుండా అడవుల్లో ఎందుకు వదలకూడదన్న ఆలోచన వైపు మళ్లించిందని చెబుతున్నాడు ముజాఫర్. ఈ క్రమంలోనే విషపూరితం కాని పాములు ఒకటి రెండుసార్లు కాటు వేసిన సందర్భాలున్నాయి. ఉద్యోగం వచ్చిన తొలినాళ్లలో కొత్తగూడెంలో పోస్టింగ్ రాగా అదే సమయంలో కొత్తగూడెంలోని ప్రాణధార ట్రస్ట్‌లో శిక్షణ తీసుకుని మెళకువలు నేర్చుకుని ఎలాంటి అపాయాలు లేకుండా మరిన్ని జాగ్రత్తలు తీసుకుని పాములను అడవులకు తరలిస్తున్నాడు.

ఎంతటి విషసర్పాలైనా చిటికెలో..

ఏరియాలోని సివిల్ విభాగంలో పనిచేసే ముజాఫర్ విధులు నిర్వర్తిస్తూనే ఇళ్లు, కార్యాలయాల్లోకి చొరబడ్డ పాముల కదలికలను పసిగట్టి చాకచక్యంగా పట్టుకోగల సమర్థుడిగా పేరుంది. విష ప్రభావం చూపని పాములు కాటువేసినా వాటికి ఎలాంటి హాని చేయకుండా వాటిని అడవుల్లో వదలడం అలవాటుగా మార్చుకున్నాడు. అలా 18వ ఏట నుంచి ఇప్పటివరకు ముజాఫర్ 3 వేలకు పైగా పాములు పట్టుకుని అడవుల్లో వదిలాడు. ఎలాంటి లాభాపేక్ష లేకుండా పీవీకాలనీలో అడవులకు చేరువగా ఉన్న క్వార్టర్లల్లోని కలుగులోకి దూరిన వందలాది పాములను అడవులకు తరలించి కార్మిక కుటుంబాలకు భరోసా కల్పించడంతోపాలు పాఠశాలల్లో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నాడు. దీంతో అటవీ విభాగం, సింగరేణి అధికారులు ప్రశంసించారు.

హాని కలిగించవద్దు..



పాములు రైతుమిత్రులు. ఎన్నో విషకీటకాలు పంట పొలాలకు, ప్రజలకు హాని కలిగించకుండా పాములు తోడ్పడతాయి. జనారణ్యంలోకి వచ్చే పాములు స్వీయ రక్షణ కోసమే బుసలు కొడతాయి. ఎవరికీ హాని కలిగించవు. పాములు కనిపించినా హాని తలపెట్టొద్దు. ప్రభుత్వం స్పందించి సహకరించి హుక్, క్యారీ బ్యాగ్‌లు, లైట్లు, గమ్ షూస్ అందించాలి. దీంతో మరిన్ని చోట్ల ప్రజలను భయాందోళనకు గురి చేసే పాములను పట్టి అడవుల్లో వదిలివేడయం ద్వారా జీవ వైవిధ్యాన్ని కాపాడే అవకాశం ఉంటుంది.

–ముజాఫర్, స్నేక్ క్యాచర్